
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 6 అక్టోబరు 2024
5





సంతాన లక్ష్మిగా అమ్మవారు

భద్రాచలం, అక్టోబరు 5: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం లక్ష్మీతాయారు అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం గజలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు.

సాహిత్య గుమ్మం.. ఖమ్మం!

- కవిత్వం, కథ విభాగాలకు వెన్నుదన్ను
- వర్ధమాన సాహిత్యకారులకు పురస్కారాల ప్రదానం
- రెండు తెలుగు రాష్ట్రాల స్థాయికి విస్తరించిన సాహిత్య సేవ
- సృజన రంగంలో తనదైన ముద్ర



వివరాలు : 6లో

రెడ్ కారిడార్‌కు బీటలు

- దండకారణ్యంలో గర్జిస్తున్న పోలీస్ తూటాలు
- వరుస ఎన్‌కౌంటర్లలో మృతి చెందుతున్న నక్సల్స్
- డీలాపడిన మావోయిస్టు పార్టీ
- అన్నలను దెబ్బతీసిన టెక్నాలజీ



వివరాలు : 6లో



అభిమానులకు అభివాదం చేస్తున్న సినీ హీరోయిన్ కీర్తి సురేష్

అంగరంగ వైభవంగా..

- ఖమ్మంలో ఘనంగా జీవీ మాల్ ప్రారంభోత్సవం
- పాల్గొన్న మంత్రి తుమ్మల... సందడి చేసిన హీరోయిన్ కీర్తి సురేశ్
- అలరించిన బజర్దస్త్ కమెడియన్లు ... వెల్లువెత్తిన జనం

6

ఖమ్మం వైరా రోడ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జీవీ మాల్ శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాల్‌ను లాంఛనంగా ప్రారంభించారు. ఈ వేడుకలో సినీ హీరోయిన్ కీర్తి సురేష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 'లవ్‌యూ ఖమ్మం..' అంటూ అభివాదం చేశారు. అభిమానుల కోరిక మేరకు దసరా చిత్రంలోని డైలాగ్‌ను, చెమ్కీల అంగీలేసి అనే పాటకు స్టెప్పులేశారు. మాల్‌లోని అన్ని ఫ్లోర్లలో కలియ తిరిగి వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలు చీరలను తన వంటిపై కప్పుకొని ఫొటోలకు పోజిచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీరజ, జీవీ మాల్ అధినేతలు గుర్రం ఉమామహేశ్వరరావు, వాసు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

-ఖమ్మం సాంస్కృతికం

చారిత్రక పురాతన కట్టడాలకు కొత్త కళ రాబోతుంది. చరిత్రకు సాక్షాలుగా నిలిచి ఉన్న అనేక కట్టడాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యచరణ సిద్ధం చేయడంతో ఖమ్మం ఖిల్లాకు పర్యాటక హంగులు రాబోతున్నాయి. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖిల్లా అభివృద్ధికి కార్యాచరణ సిద్ధమవుతోంది. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ ఖిల్లా వైభవాన్ని నేటితరానికి పరిచయం చేసేందుకు రూ.29కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పర్యాటకలను ఆకర్షించేలా పురాతన కోటకు కొత్త అందాలు జోడించనున్నారు. ఖమ్మం కార్పొరేషన్ భాగస్వామ్యంతో రాష్ట్ర పర్యాటక శాఖ సంయుక్తంగా రూ.29కోట్ల అంచనాతో రోప్‌వే, మినీసినిమా థియేటర్ వంటి సౌకర్యాలు సమకూర్చేందుకు ప్రణాళిక రూపొందించారు. పూర్తి డీపీఆర్ సిద్ధం చేసి టెండర్లు పిలిచి పనులు వేగవంతంగా చేపట్టేందుకు అధికారయంత్రాంగం చకచకా చర్యలు చేపట్టింది.



ఘన చరిత్రకు.. నవ్య కాంతులు...

చారిత్రక ఖమ్మం ఖిల్లాకు పర్యాటక సొబగులు



ఖమ్మం ఖిల్లా పైకి వెళ్లేందుకు ఏర్పాటు చేయనున్న రోప్‌వే(ఊహచిత్రం)

- రూ.29 కోట్లతో అభివృద్ధికి ప్రతిపాదనలు
- ఖిల్లాపైకి వెళ్లేందుకు రూ.16 కోట్లతో రోప్ వే
- పర్యాటకులను ఆకట్టుకునేలా పలు ఏర్పాట్లు
- వినోదం, కాలక్షేపం కలిగించేలా హంగులు
- పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి ప్రణాళిక
- ప్రత్యేకంగా దృష్టి సారించిన మంత్రి తుమ్మల

ఖమ్మం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒకప్పుడు ఖమ్మం మెట్టుగా, నేడు ఖమ్మం ఖిల్లాగా పిలువబడుతున్న ఈ గిరికోట సుదీర్ఘ చారిత్రక నేపథ్యాన్ని కలిగి ఉంది. ఈ ఖిల్లాను కాకతీయులు, రెడ్డిరాజులు, ముసునూరి రాజులు, నిజాం రాజులు కేంద్రంగా చేసుకొని ఈ ప్రాంతాన్ని పాలించారు. ఖమ్మం ఖిల్లాకు వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. మొట్టమొదట క్రీ.శ. 950లో ఖమ్మం మెట్టుగా దీనికి పునాదులు వేశారు. ఈ ఖిల్లా 400 ఏళ్ల పాటు కాకతీయుల ఆధీనంలో ఉండగా 300 ఏళ్లపాటు రెడ్డిరాజులు పాలించారు. అప్పటికి సైన్యాధిపతుల్లో వచ్చిన విబేధాలతో ఈ కోటను పలువురు వశం చేసుకొని పరిపాలన సాగించారు.

ముసునూరి నాయకులు నందపాణి, కల్లూరు, గుడ్లూరు రాజులు, పద్మనాయకరాజులు స్వతంత్రంగా ఈ కోటను కేంద్రంగా చేసుకుని పాలన సాగించారు. ఆ తర్వాత ఖిల్లా కుతుబ్‌షాహీల వశమైంది. వారి హయాంలో ఖిల్లా మరింతగా అభివృద్ధి చెందింది. మొదట ఖమ్మం మెట్టుగా ఉన్న ఖిల్లాను కుతుబ్‌షాహీల వశమైన తర్వాత ఖిల్లాగా మార్చారు. 687 మీటర్ల ఎత్తు ఉన్న ఈ ఖిల్లాను గ్రానైట్ రాళ్లతో నిర్మించారు. ఈ కోట నాలుగు చదరపు మీటర్ల మేర విస్తరించి ఉంది. ఈ కోటకు 10 ద్వారాలు ఉండగా పశ్చిమవైపున దిగువకోట ప్రధానగోడ తూర్పువైపున రాతిదర్వాజ నిర్మించారు. కోటచుట్టూ 60 ఫిరంగులు ఏర్పాటు చేశారు. 60 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పుతో జాఫర్‌అనే పేరుతో బావి నిర్మించారు. కోటను ఎవరైనా ముట్టడిస్తే తప్పించుకునేందుకు రహస్య సొరంగం కూడా ఉంది. ఎంతో చరిత్ర కలిగిన ఈ కోట సమీపంలోని ఖాళీ ప్రదేశాలు కొన్ని ఆక్రమణలకు గురికాగా మరి కొన్ని చోట్ల కోట గోడలు శిథిలావస్థలకు చేరాయి. ప్రస్తుతం ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్నందున ఖిల్లాను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును ఖిల్లాకు తీసుకువచ్చి చూపించారు. దీంతో ఖిల్లా అభివృద్ధికి ప్రభుత్వం నుంచి కూడా అంగీకారం రావడంతో వెంటనే ప్రతిపాదనలు చేయించారు.

(మిగతా 6వ పేజీలో)

అభివృద్ధికి రూ.29 కోట్లతో ప్రతిపాదనలు



ఖమ్మం ఖిల్లాకు పర్యాటక సొబగులు అద్దేందుకు మొత్తం రూ.29 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అందులో ఖిల్లాపైకి వెళ్లేందుకు రోప్‌వేకు రూ.16 కోట్లు, పార్కింగ్ సౌకర్యాలకు రూ.కోటి 50 లక్షలు, టికెట్ కౌంటర్‌కు రూ.3.50 లక్షలు, టూరిస్టు వాకింగ్ హాల్ రూ.కోటి 22 లక్షలు, ఫుడ్‌కోర్టు రూ.కోటి 96 లక్షలు, టాయిలెట్ల నిర్మాణానికి రూ.28 లక్షలు, చిల్డ్రన్ ప్లేపార్కుకు, మంచినీటి సదుపాయానికి రూ.కోటి, అడ్వంచర్ గేమ్స్ రూ.50 లక్షలు, బెంచీలు, ఇతర సీటింగ్ నిర్మాణానికి రూ.50 లక్షలు, సీసీ కెమెరాలు, విద్యుత్ లైన్ల నిర్మాణానికి రూ.75 లక్షలు, 5డీ డైనమిక్ సినిమాహాల్ 20 సీట్లతో రూ.కోటి 25 లక్షలతో నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించారు. ఖిల్లాను చూసేందుకు వచ్చే పర్యాటకులకు పార్కింగ్ సదుపాయం, రోడ్లు, మెట్లు, ఇతర సదుపాయాలు కూడా కల్పించబోతున్నారు.

ఇక విపత్తుల సైన్యం

- నగర పాలక సంస్థ పరిధిలో 60 మంది 'ఆపద మిత్ర'లు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 5: ప్రకృతి విపత్తులు, అత్యవసర సమయంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు ఖమ్మం నగర పాలక సంస్థకు మరో సైన్యం తోడుకానుంది. ఇప్పటికే డీఆర్‌ఎఫ్ బృందాలు అందుబాటులో ఉండగా ఇప్పుడు ఆపద మిత్రలు తోడుగా రానున్నారు. సముద్రాలు, నదుల సమీపంలో పరివాహక ప్రాంత ప్రజల్ని విపత్తులు, వరదల సమయంలో రక్షించేందుకు స్థానికంగా ముంపు ప్రాంతాల్లో యువతీ, యువకులకు శిక్షణలు ఇచ్చి వారిని ప్రభుత్వ మిత్రాలుగా అత్యవసర సమయంలో వాడుతుంటారు. దేశ వ్యాప్తంగా సముద్రతీర ప్రాంతాల్లో ఇటువంటి మిత్రలను నియామకం చేస్తారు. సెప్టెంబరు 1న ఖమ్మంలోని మున్నేరుకు 40అడుగులకు పైగా వరద పోటు రావటంతో ఎన్‌డీఆర్ఎఫ్, అత్యవసర బలగాల ఆవశ్యకతపై చర్చ జరిగింది. ఈ క్రమంలోనే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో మేయర్ పునుకొల్లు నీరజ పర్యవేక్షణలో ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలో అపద మిత్రలను నియమించేందుకు

(మిగతా 6వ పేజీలో)



చిమ్మపూడిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు

- రూ.2 లక్షలకు పైగా రుణాలు కలిగి ఉన్న రైతులకు రుణమాఫీ అమలు
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- రూ.3కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభం

6

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

- మొత్తం 1,336 మంది సర్టిపికెట్ల పరిశీలన పూర్తి
- సూపరింటెండెంట్ తీరుపై అభ్యర్థుల నిరసన

ఖమ్మం ఖానాపురం హవేలి, అక్టోబరు 5: ఈ నెల 2వ తేదీ నుంచి ప్రాంభమైన డీఎస్సీ 2024 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శనివారంతో ముగిసింది. మొత్తం 1,336 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. 106 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాలేదని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6:30 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించారు. మొత్తం ఎస్‌ఏలు 475, ఎస్‌జీటీలు 790, ఎల్‌పీలు 46, పీఈటీలు 25 మందికి సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తికాగా, ఎస్‌ఏలు 33, ఎస్‌జీటీలు 65, ఎల్‌పీలు 3, పీఈటీలు ఐదుగురు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకాలేదని డీఈవో తెలిపారు. కాగా డీఎస్సీ అభ్యర్థుల దరఖాస్తులను స్క్రూటినీ చేసిన అనంతరం ఎకనాలెడ్జ్‌మెంట్ ఇవ్వకపోవటంపై 305 మంది డీఎస్సీ అభ్యర్థులు శనివారం సర్టిఫికెట్స్ పరిశీలన కేంద్రం వద్ద డీఈవో ముందు నిరసన వ్యక్తం చేశారు. డీఈవో వెంటనే ఎకనాలెడ్జ్‌మెంట్ ఇప్పించటంతో నిరసన విరమించారు. ఎకనాలెడ్జ్‌మెంట్స్ ఇవ్వకుండా దురుసుగా వ్యవహరించిన డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబుపై చర్యలు తీసుకోవాలని పలువురు అభ్యర్థులు ధర్నా నిర్వహించారు. స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించిన 38 మంది ఉపాధ్యాయుల దరఖాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని అభ్యర్థులు డీఈవోను కోరారు.

రేపు సింగరేణి కార్మికులకు

లాభాల వాటా చెల్లింపు

- మార్గదర్శకాలు విడుదల చేసిన సంస్థ

ఇల్లెందు, అక్టోబరు 5: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన సింగరేణి కార్మికులు, ఉద్యోగులకు లాభాల వాటా సొమ్మును 7వ తేదీ సోమవారం చెల్లించనున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ నేపథ్యంలో లాభాల వాటా చెల్లింపునకు సంబంధించిన మార్గదర్శకాలను యాజమాన్యం శనివారం జారీ చేసింది. కార్మికుల అటెండెన్స్‌పై 85శాతం (రూ.679 కోట్ల మూడు లక్షలు), గ్రూప్ పర్ఫామెన్స్‌పై 14శాతం(రూ.111కోట్ల 45 లక్షలు), ఇన్సెంటివ్‌పై ఒక శాతం (రూ.ఐదు కోట్ల 57 లక్షలు) కేటాయించారు. అండర్ గ్రౌండ్‌లో పనిచేసే కార్మికులకు రోజుకు రూ.771.11, ఉపరితలంలో పనిచేసే వారికి రోజుకు రూ.610.46, డిపార్ట్‌మెంట్‌లో పనిచేసే వారికి రోజుకు రూ.563.50. చొప్పున చెల్లించాలని నిర్ణయించారు. సింగరేణి కాలరీస్‌లో గత ఆర్థిక సంవత్సరంలో గడించిన నికర లాభాల్లో కార్మికులకు 33శాతం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్ణయించిన సంగతి తెలిసిందే.. కాగా కార్మికులకు ఈ లాభాల వాటా సొమ్మును 7వ తేదీన చెల్లించనున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి కె. సారయ్య తెలిపారు.



అప్పు కడితేనే పింఛన్ పైసల్..

లేదంటే జమచేసుకుంటాం

- ఏపీజీవీబీ అధికారుల నిర్వాకం

చంద్రుగొండ, అక్టోబరు 5: 'నువ్వు, నీ కోడలు తీసుకున్న అప్పులు కడితేనే నీకు ఇవ్వాల్సిన పింఛన్ పైసల్ ఇస్తాం లేదంటే అప్పుకు జమచేస్తామంటూ' బ్యాంక్ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని మండలంలోని రావికంపాడుకు చెందిన 80 ఏళ్ల నిరుపేద వృద్ధుడు రెడ్డిపోగు గోపయ్య తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. చంద్రుగొండ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ శాఖలో గోపయ్య వ్యవసాయ రుణం, కోడలకు డ్వాక్రా రుణం చెల్లింపులో జాప్యం జరిగింది. దీంతో బ్యాంక్ అధికారులు గోపయ్య ఆసరా పింఛన్‌ను ప్రతి నెల నిలుపుదల చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలోని పెద్దల సిఫారసుతో పింఛన్ పొందుతున్నాడు. అయినా బ్యాంక్ అధికారులు గత సంవత్సరం రూ 5వేలను అప్పునకు జమ చేసుకున్నారు. ఈ నెల కూడా పింఛన్ నితలు పుదలచేయటంతో గోపయ్య తీవ్ర ఆవేదనతో గ్రామంలో నిరసనకు దిగాడు. ఈ సమాచారం తెలుసుకున్న ఎంపీడీవో అశోక్ బ్యాంక్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తక్షణమే గోపయ్యకు పింఛన్ ఇవ్వాలని ఆదేశించారు. దీంతో పంచాయితీ కార్యదర్శి సమక్షంలో పింఛన్ విడుదల చేశారు. ఇది ఇలా ఉండగా పలు గ్రామాల్లోని వందలాది మంది పింఛన్ దారులను బ్యాంక్‌లు ఈ విధంగానే ఇబ్బందులకు గురి చేస్తున్న సంఘటనలు ఉన్నాయి.



బాధిత వృద్ధుడు గోపయ్య


బిగ్గెస్ట్ జీవీ మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఘనంగా జీవీ మాల్ ప్రారంభోత్సవం

- యాజమాన్యాన్ని అభినందించిన మంత్రి తుమ్మల
- సందడి చేసిన సినీ హీరోయిన్ కీర్తి సురేశ్
- అలరించిన బజర్దస్త్ కమెడియన్లు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబర్ 5: ఖమ్మం వైరా రోడ్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన ప్రముఖ వస్త్ర దుకాణం బిగ్గెస్ట్ జీవీ మాల్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నగర మేయర్ పునుకొల్లు నీరజతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సినీ తార కీర్తి సురేష్ తన ఆట, మాటతో అభిమానులను ఉర్రూతలూగించగా, జబర్దస్త్ కమెడియన్లు హైపర్ ఆది, ఆటో రాంప్రసాద్ తమదైన కామెడీతో అలరించారు. ముందుగా ప్రధాన షాపింగ్ మాల్‌ను రిమోట్‌తో, తర్వాత వివిధ విభాగాలను స్వయంగా రిబ్బన్ కట్ చేసి మంత్రి తుమ్మల ప్రారంభించారు. అనంతరం జీవీమాల్‌లో వివిధ అంతస్తుల్లో ఏర్పాటుచేసిన వస్త్ర విభాగాలను సందర్శించారు. ఈ సందర్భంగా మాల్ యజమానులు మంత్రి, మేయర్‌ను, ఇతర అతిథులను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీవీ మాల్ అధినేతలు గుర్రం ఉమామహేశ్వరరావు, వాసు, సంతోష్, కార్పొరేటర్ చావా నారాయణ రావు, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు కమర్తపు మురళి, మడూరి సైదరావు, తదితరులు పాల్గొన్నారు.


ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఖమ్మం ప్రజలకు సేవ చేసే ఉద్దేశ్యంతో మెగా జీవీమాల్‌ను ఖమ్మంలో నెలకొల్పటం హర్షణీయమని కొనియాడారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత ప్రశాంత, పరిశుభ్ర నగరంగా పేరుగాంచిన ఖమ్మం.. అతి వేగంగా అభివృద్ధి చెందుతోందని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని పెద్ద కంపెనీల బ్రాండెడ్ షోరూమ్‌లు ఖమ్మంలో ఏర్పాటు కావటంద్వారా మేలైన వస్త్రాలు, వస్తువులు అందుబాటులోకి రావటంతోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించాలన్నారు. వస్త్ర దుకాణదారులు తమ లాభాన్ని కొంత తగ్గించుకొని ప్రజలకు తక్కువ ధరకు మేలైన వస్త్రాలను సమకూరుస్తారన్నారు.

సందడి చేసిన కీర్తి సురేష్..

'లవ్యూ.. ఖమ్మం' అంటూ సినీ హీరోయిన్ కీర్తి సురేష్ సందడి చేశారు.. తన మాటలతో అలరించటంతోపాటు అభిమానుల కోరిక మేరకు దసరా చిత్రంలోని డైలాగ్‌ను, చెమ్కీల అంగీలేసి అనే పాటకు స్టెప్పులేశారు. 'ఉయ్ లవ్ ఖమ్మం, థాంక్యూ..' అంటూ మురిపించారు. జీవీ మాల్‌లోని అన్ని ఫ్లోర్లలో కలియ తిరిగి వస్త్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా పలు చీరలను తన వంటిపై కప్పుకొని ఫొటోలకు పోజిచ్చారు. షోరూంలో పనిచేసే సిబ్బందిని, వినియోగ దారులను, దుకాణ దారుల కుటుంబీకులను పలకరిస్తూ వారితో సెల్ఫీలు దిగారు. అనంతరం అభిమానుల నుద్దేశించి మాట్లాడుతూ జీవీమాల్ ఎంతో విశాలంగా ఎన్నో వేల వస్త్ర వెరైటీలతో ఉందన్నారు. కాగా, జీవీ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా జబర్దస్త్ కమెడియన్లు హైపర్‌ఆది, ఆటో రాంప్రసాద్ తమదైన పంచ్ జోక్‌లతో అభిమానులను అలరించారు.. పలు అంశాలపై స్పాంటేనియస్‌గా హాస్యం పండిస్తూ హాజరైన వారిని నవ్వించారు.

కాగా, ఖమ్మం ప్రజలకు అతి తక్కువధరలో అత్యుత్తమ వస్త్రాలు అందించాలన్న ఉద్దేశంతో నూతన షోరూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జీవీ మాల్ అధినేత గుర్రం ఉమామహేశ్వరరావు తెలిపారు. రాష్ట్రంలో పలు చోట్ల వస్త్ర దుకాణాలను నెలకొల్పటం ద్వారా వేలాది మందికి ఉపాధి సైతం కల్పిస్తున్నానని చెప్పారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కీర్తి సురేష్


షాపింగ్ సందడి చేస్తున్న నటి

ఘన చరిత్రకు నవ్యకాంతులు



(5వ పేజీ తరువాయి)

ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి



ఎంతో చరిత్ర కలిగిన ఖమ్మం ఖిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించనున్నాం. ప్రస్తుతం ఖిల్లా ఎక్కాలంటే పిల్లలకు, పెద్దలకు సాధ్యం కావడంలేదు. రోప్‌వే ద్వారా ఖిల్లాపైకి వెళ్లేందుకు సౌకర్యం కల్పిస్తున్నాం. ఖమ్మం ఖిల్లాను అభివృద్ధి చేయాలనేది నా సుదీర్ఘకాల కల. గతంలో కొంత ప్రయత్నం చేశాం.. కానీ సాధ్యం కాలేదు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఖమ్మం జిల్లాను పర్యాటక గుమ్మంగా తీర్చిదిద్దేందుకు ఖిల్లాతో పాటు పాలేరు, వైరా రిజర్వాయర్‌లు, నేలకొండపల్లి బౌద్ధస్థూపం, పురాతన శివాలయం, స్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, లకారం ట్యాంక్‌బండ్, వెలుగమట్ల అర్బన్‌పార్క్, పెనుబల్లి అడవుల్లో ఎకోటూరిజం, కిన్నెరసాని అభయారణ్యం, జూపార్కు, బోటింగ్, జమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం, భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు ఖమ్మంజిల్లాలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, పోర్టు టూరిజం, రివర్ టూరిజం, ఇండస్ట్రీ టూరిజం అభివృద్ధికి కృషి చేస్తున్నాం.


ధైర్యలక్ష్మీ అలంకారంలో అమ్మవారు

ఘనంగా దేవీ శరన్నవరాత్రులు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబర్ 5: కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు , ఆధ్మాతిక కార్యక్రమాలు, సాంస్కృతిక సందళ్లు నగరంలో దేవీ శరన్నవరత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.. స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంతో పాటు పలు దేవాలయాల్లో, నగరంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికల వద్ద దేవీ నవరాత్రులు కొనసాగుతున్నాయి. లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం అమ్మవారిని ధైర్యలక్ష్మీ రూపంలో అలంకరించారు. ఇల్లెందు రోడ్‌లోని గర్భరక్షాంబిక గాయత్రి దేవాలయంలో అమ్మవారికి ధైర్యలక్ష్మీ అలంకారం నిర్వహించారు. వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాతను మానసాదేవిగా అలంకరించారు.

కాగా ఇతర ఆలయాల్లో వేర్వేరు రూపాల్లో అలంకరించారు. ఈసందర్భంగా మహిళలచే కుంకుమ పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ప్రసాదాలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు.


రవి మారుత్ | శ్రీనివాస్ | సీతారాం | యాకూబ్ | నిర్గున్ | సునంద | సుభాషిణి

సాహిత్య గుమ్మం... ఖమ్మం

కవిత్వం, కథ విభాగాలకు వెన్నుదన్ను

'ఉద్యమాల గుమ్మం... ఖమ్మం' అంటే కవిత్వం ఒక్కటే కాదు, కథకూడా అనే స్థాయిలో ఖమ్మం సాహిత్యం తన ఉనికిని చాటుతోంది. ఇక్కడి సాహిత్యవ్యాప్తి కథకు విస్తరించింది.. కథా విభాగంలో యువ రచయితలు, రచయిత్రులు జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు గెలుపొందతుండటంతోపాటు కథా సంపుటాలను వెలువరిస్తున్నారు. ఖమ్మం నేల నుంచి అఫ్సర్, వంశీ కృష్ణ, కె. ఆనందాచారి, తాటికొండాల నరసింహారావు, సమ్మెట ఉమాదేవి, జ్వలిత, ఉరిమళ్ల సునంద, రాచమళ్ల ఉపేందర్, ఎనగంధుల దేవయ్య, మారాబత్తుల పెద్దన్న, మరీదువేణు, విద్యాసాగర్, కంచర్ల శ్రీనివాస్ తదితరులు కథా సాహత్యంలో రాణిస్తున్నారు. గతంలో చావా శివకోటి, కౌముది, హీరాలాల్ మోరియా, కవిరాజమూర్తి, నీరుకొండ హనుమంతరావు, అంకిత కేశవులు తదితరులు ఖమ్మం కథకు కీర్తి తెచ్చారు.

- వర్ధమాన సాహిత్యకారులకు జాతీయ స్థాయి పురస్కారాల ప్రదానం
- రెండు రాష్ట్రాల స్థాయికి విస్తరించిన సాహిత్య సేవ

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు5: ఖమ్మానికి చెందిన పలు సాహిత్య సంస్థలు కథ, కవిత్వ విభాగాల్లో ప్రతిభావంతులకు జాతీయ స్థాయిలో బహుమతులు ఇచ్చే స్థాయికి చేరటంతో ఖమ్మం సాహిత్య సేవ ఉమ్మడి రాష్ట్రంలో ప్రముఖంగా మారింది. ఖమ్మం కవులగుమ్మం అన్న నానుడి ఎప్పటినుంచో ఉంది. మొదటి నుంచి దిగ్గజ కవి శ్రేష్ఠులను కలిగి ఉండటంతో ఖమ్మం తెలుగు రాష్ట్రాల్లో కవుల కార్ఖానా అన్న బిరుదు పొందింది. నాటితరం చందాల కేశవదాసు, దాశరథి సోదరులు మొదలుకొని సీతారాం, అఫ్సర్, ప్రసేన్, యాకూబ్, వంశీకృష్ణల దాకా ఎందరో మేటి కవులను అందించిన ఘనత ఖమ్మం సొంతం. మేలైన కవిత్వం రాయటం పుస్తకాలను వెలువరించటమే కాక జాతీయ స్థాయిలో కవులకు అవార్డులు బహుమతులు ప్రదానం చేసే స్థాయికి ఖమ్మం కవులు, సాహిత్య సంస్థలు ఎదగటం విశేషం.

☛ మెగా పోయెట్‌గా పేరొందిన మువ్వా శ్రీనివాసరావు ఏర్పాటు చేసిన మువ్వా పద్మావతి, రంగయ్య అవార్డు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారింది. భారీ స్థాయిలో కార్యక్రమాలను సభలను జాతీయ స్థాయి సాహితీవేత్తలతో నిర్వహించటం ప్రముఖ సాహితీవేత్తకు పురస్కారంతోపాటు ఏటా తొమ్మిది మంది యువ కవులకు, కవిప్రముఖులకు అవార్డులతో సత్కరిస్తున్నారు. ఈ అవార్డులతోపాటు గతేడాది నుంచి ప్రముఖ కవి ఆవంత్స సోమసుందర్ పేరున మరో ప్రత్యేక అవార్డును సాహితీవేత్తలకు అందిస్తున్నారు. మెగా ఈవెంట్ నిర్వహిస్తూ కవులను సముచితరీతిన సత్కరిస్తుండటంతో తెలుగు రాష్ట్రాల్లోని సాహిత్య దిగ్గజాలు, కవుల చూపు ఖమ్మం వైపుగా మారింది. పద్మావతి రంగయ్య అవార్డుతోపాటు కవి, జర్నలిస్టు అరుణ్‌సాగర్ స్మారక అవార్డును జర్నలిస్టులతోపాటు కవి ప్రముఖులకు అందజేస్తుండటం విశేషం. మువ్వా శ్రీనివాసరావు, పగిడిపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న గుర్రం జాషువా సాహిత్య సంస్థ సైతం ప్రత్యేక పురస్కారాన్ని అందజేస్తోంది. 'మన కాలం జాషువా' పేరున సాహిత్య ప్రముఖుడికి పురస్కారం ఇచ్చే ఆనవాయితీకి గతేడాది శ్రీకారం చుట్టారు.ఈ పురస్కారాన్ని గతేడాది ప్రముఖ సాహితీవేత్త కొలకలూరి ఇనాక్‌కు అందజేయగా ఈఏడాది కత్తి పద్మారావుకు ఇటీవల ప్రదానం చేశారు.

☛ ప్రముఖ కవి విమర్శకుడు కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన 'సాహితీ మాణిక్యం' కవిత్వంలో కృషి చేస్తున్న వారిని గుర్తించి మాణిక్యం అవార్డుతో సత్కరించే కార్యక్రమం ప్రతీ సంవత్సరం నిర్వహిస్తున్నారు. సాహితీ మాణిక్యం అవార్డును అందుకోవటం తమ సాహిత్య కృషికి దక్కిన గౌరవంగా కవులు భావించే స్థాయికి ఈ అవార్డు ఎదిగింది.

☛ మరో కవి దిగ్గజం కవిసంగమం సాహిత్య సంస్థ నిర్వాహకుడు యాకూబ్ రొట్టమాకు రేవు అవార్డు పేరుతో ప్రదానం చేస్తున్న అవార్డుకు తెలుగు సాహితీ లోకంలో మంచి పేరు దక్కింది. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించినా సరే జిల్లాలోని రొట్టమాకు రేవు గ్రామం పేరుతో పరిసర ప్రాంతాల ప్రముఖుల పేర్లతో కవులకు అవార్డులు అందజేస్తున్నారు.

☛ ఇటీవల మరొక ప్రభంజనంలా దూసుకొచ్చిన సాహిత్య సంస్థ ఖమ్మం ఈస్థటిక్స్. ప్రముఖ విద్యావేత్త రవి మారుత్ ఈ అవార్డును నెలకొల్పటంతో పురస్కారానికి అతి తక్కువ కాలంలో సాహిత్య గౌరవం దక్కింది. ఉమ్మడి రాష్ట్రంలోని కవులు, కథా రచయితలకు రెండేళ్లుగా ఈ సంస్థ తరుపున అవార్డులు దక్కుతుండటం, ప్రత్యేక కథా సాహిత్యం వెలువరిస్తుండటం పట్ల రెండు రాష్ట్రాల్లోని సాహితీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.

☛ మరొక సాహిత్య సంస్థ అక్షరాల తోవ స్థాపించిన అనతి కాలంలోనే తెలుగు రాషాల్లో మంచి గుర్తింపు దక్కించుకుంది. ప్రతీ సంవత్సరం కథలు, కవిత్వ పోటీలు నిర్వహిస్తూ విజేతలను ఖమ్మం ఆహ్వానిస్తూ బహుమతులు అందిస్తుండటంతోపాటు ప్రత్యేకంగా సాహిత్య పుస్తకాలను వెలువరిస్తోంది. రాచమళ్ల ఉపేందర్, దాసరోజు శ్రీనివాస్, నామా పురుషోత్తంల త్రయం ఈ అవార్డును విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

☛ ప్రముఖ రచయత్రి ఉరిమళ్ల సునంద స్థాపించిన ఉరిమళ్ల ఫౌండేషన్ సాహిత్య ప్రోత్సాహకాలను అందించటంలో తనవంతు పాత్రపోషిస్తోంది. కథలు, కవిత్వంలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తోంది.

☛ ప్రముఖ కవయిత్రి తోట సుభాషిణి స్థాపించిన హాసిని రామచంద్ర ఫౌండేషన్ (హెచ్‌ఆర్‌సీ) సైతం సాహిత్య వ్యాప్తికి తనవంతు పాత్రపోషిస్తోంది. కథా విభాగంలో ఆణిముత్యాలను గురిస్తూ గతేడాదినుంచి పురస్కారాలను ప్రదానం చేస్తున్నారు. హెచ్‌ఆర్‌సీ పురస్కారాన్ని గతేడాది ప్రముఖ కథా రచయిత్రి యండపల్లి భారతికి అందించగా ఈ ఏడాది ప్రముఖ కవి ఆశారాజుకు ప్రదానం చేశారు. పురస్కారంతోపాటు కవిత్వం, కథల సృజనలో కృషి చేస్తున్న ప్రతిభావంతులకు ఈ అవార్డుల ద్వారా గుర్తింపు లభిస్తోంది.

☛ యువ కవి, ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు గ్రహీత ఇబ్రహీం నిర్గున్ ప్రముఖ కవి శివారెడ్డిపై గౌరవంగా నెలకొల్పిన ప్రత్యేక అవార్డును ఇటీవల యువకవి దొంతం చరణ్‌కు అందించారు.

☛ ప్రముఖ కవి విమర్శకుడు వంశీక్రిష్ణ, ఆయన తండ్రి తాటికొండాల నరసింహారావు తాటికొండాల భ్రమరాంబ సాహిత్య పురస్కారాలు పేరుతో సంస్థను నెలకొల్పి ఇటీవల పురస్కారాలు అందజేశారు. 2023 సంవత్సరానికి గానూ ప్రముఖ కవి ఎన్. గోపికి, 2024 సంవత్సరానికి గానూ కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ సభ్యుడు ప్రసేన్‌కు అవార్డులు అందజేశారు.

☛ కవి అఫ్సర్ తన తండ్రి కౌముది పేరున సాహిత్య ఫౌండేషన్ ఏర్పాటు చేశారు...

రెండు రాష్ట్రాల్లో గుర్తింపు..

సాధారణంగా మెట్రో స్థాయి నగరాల్లో రెండో మూడో సాహిత్య సంస్థలు కవిత్వ బహుమతులు అవార్డులు ఇచ్చే స్థాయి కలిగి ఉంటాయి. ఖమ్మం లాంటి నగరం నుంచే అయిదారు సాహిత్య సంస్థలు జాతీయ స్థాయిలో తమవంతు సాహిత్య సేవ చేస్తుండటం పట్ల కొత్తతరం సాహితీకారులకు రెండు తెలుగు రాష్ట్రాల్లో మరింత గుర్తింపునకు కారణమయ్యింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు ఇతర రాష్ట్రాల్లో సైతం నివసించే తెలుగు సృజనకారుల కవితలు, కథలకు, వారి సంపుటాలకు బహుమతులను ప్రదానం చేస్తున్నారు. ప్రత్యేకంగా పోటీలను ఏర్పాటు చేసి రచనలు ఆహ్వానిస్తుండటంతో ఏడాది పొడవునా ఏదో ఒక సాహిత్య సంస్థకోసం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాల్లోని కవులు, కథా రచయితలు ఖమ్మం సాహిత్యం వైపు దృష్టి సారిస్తున్నారు. ఎటువంటి ప్రతిఫలాపేక్ష లేకుండా కేవలం సాహిత్య సేవ పరమావధిగా ఖమ్మం సాహితీవేత్తలు, సాహిత్య సంస్థల ప్రతినిధులు తమవంతు సేవలందిస్తున్నారు.



రాచమళ్ల ఉపేందర్, దాసరోజు శ్రీనివాస్, నామ పురుషోత్తం

సంక్రాంతికి ఇందిరమ్మ ఇళ్లు

● మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం సంక్షేమ విభాగం/ రఘునాథపాలెం, అక్టోబరు 5: సంక్రాంతి పండగ నాటికి పేద ప్రజల కోరికగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లు అందుబాటులోకి వస్తాయని, ఈ మేరకు ప్రభుత్వం అడుగులు వేస్తోందని, రైతులకు సంక్షేమ పథకాలను దశల వారీగా అమలు చేస్తోందని, ఇప్పటికే రూ. 2లక్షల లోపు రుణమాఫీ అమలు చేసిన ప్రభుత్వం ఇప్పుడు రూ.2లక్షల పైబడిన రుణమాఫీ చేసేందుకు సిద్ధంగా ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

ఖమ్మం నియోజకవర్గంలోని ఖమ్మం, రఘునాథపాలెం మండలంలోని కోటపాడు,వీఆర్ బంజర, జీకే బంజర,పాపటపల్లి, చిమ్మపూడిలో శనివారం మంత్రి తుమ్మల విస్తృతంగా పర్యటించారు. రూ.3కోట్ల అభివృద్ధి పథకాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి తుమ్మల మాట్లాడుతూ రైతులు లాభదాయకమైన పంటలను సాగు చేయాలని, ఆయిల్‌పామ్ సాగుద్వారా రైతులకు అధిక లాభాలు వస్తాయని వివరించారు. గ్రామాల్లో గుడిసెలు, రేకుల ఇళ్లలో ఉండే వారి జాబితాలను పంచాయతీ కార్యదర్శులు రూపొందించి తనకు పంపితే శాశ్వత ఇళ్లు లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తుమ్మల హామీ ఇచ్చారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, బస్సు సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తూ పోతూ ఉంటారు. కానీ ప్రజలు మాత్రమే స్థానికంగా శాశ్వతంగా ఉంటారని, రాబోయే 50ఏళ్ల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని, రహదారుల్ని ఎవ్వరు ఆక్రమించినా రాజకీయాలకు అతీతంగా తొలగించాలని తుమ్మల ఆదేశించారు.

ఖమ్మం నగరానికి ఖాళీ స్థలాలు పెద్ద సమస్యగా మారిందని, నోటీసులు ఇచ్చిన స్పందించటం లేదని అటువంటి స్థలాలపై కమిషనర్ కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడ్డగోలుగా నగరంలో డివైడర్‌లు నిర్మాణం చేశారని ప్రజాభిప్రాయం మేరకు వాటిని ఉంచాలని ఇబ్బందికరంగా ఉన్న వాటిని తొలగించాలని మంత్రి పేర్కొన్నారు. వెనుకబడిన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాలని మరోసారి నిధులు మంజూరు జరిగితే అభివృద్ధి జరిగిన ప్రాంతాలకు కేటాయించాలన్నారు. ప్రజల సొమ్మును అవసరాల మేరకు వినియోగించాలన్నారు. ప్రభుత్వం చేసే పనులు ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉండాలన్నారు. ప్రజల ఆరోగ్యం కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు.

మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ ఖమ్మం నగరంపై సంపూర్ణ అవగాహన ఉన్న మంత్రి తుమ్మల అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. కమిషనర్ అభిషేక్ ఆగస్త్య, తహసీల్దార్ లూథర్‌విల్సన్, ఎంపీడీవో అశోక్‌కుమార్, కార్పొరేటర్లు దోరేపల్లి శ్వేత, కమర్తపు మురళి, పాలేపు విజయవెంకటరమణ, మలీదు జగన్, కిషాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొంటెముక్కల నాగేశ్వరరావు, తమ్మిని నాగేశ్వరరావు, వెంకన్న, గుత్తా వెంకటేశ్వరరావు, బోయినపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ కారిడార్‌కు బీటలు..

● దండకారణ్యంలో గర్జిస్తున్న పోలీస్ తూటా

చర్ల, అక్టోబరు 5: మావోయిస్టులు ఏర్పాటు చేసుకున్న రెడ్ కారిడార్‌కు బీటలు పడుతున్నాయా ? వరుస ఎన్‌కౌంటర్లు మావోయిస్టు పార్టీ ఉనికినే తుడిచేస్తున్నాయా.. పోలీసులు ఏర్పాటు చేసుకున్న ప్రత్యేక టెక్నాలజీనే ఇందుకు కారణమా..? అనే అనే ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తోంది. మావోయిస్టు పార్టీ ఎక్కడ పుట్టిందో అక్కడి నుంచే వారిని పట్టుకోవాలనే లక్ష్యంతో కేంద్రం బలగాలు యాంటి నక్సల్ ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో అనేకమంది మావోయిస్టులు మృతి చెందుతున్నారు.

మావోయిస్టు పార్టీ 2004లో ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ నారాయణపూర్ సరిహద్దుల్లోని అబూజ్ మడ్ అడవుల్లో ఏర్పాటైంది. అప్పటి నుంచి అడవుల్లో సమాంతర ప్రభుత్వాన్ని నడిపిస్తూ రెడ్ కారిడార్ ఏర్పాటు చేసుకున్నారు. దాంతో మావోయిస్టు పార్టీ ఎక్కడ పుట్టిందో అక్కడి నుంచే ఆ పార్టీని దెబ్బ తీసి రెడ్ కారిడార్ లేకుండా చేయాలని పోలీసు బలగాలు అడుగులు వేస్తున్నాయి. గత జనవరి నుంచి ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో భారీ సంఖ్యలో మావోయిస్టులు నేలకొరిగారు. దాంతో రెడ్‌కారిడార్‌కు బీటలు పడ్డాయి.

పోలీసుబలగాల దెబ్బకు అగ్రనేతలు హతం..

పోలీసు బలగాల పంజాకు మావోయిస్టు పార్టీ నేతలు, క్యాడర్‌ను నడిపించే ముఖ్య నాయకులు మృతి చెందారు. వీరిలో రూ.25లక్షల రివార్డు ఉన్న సాగర్, శంకర్‌రావు, యేసేబు వంటి అగ్రనేతలు ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వరుస దెబ్బలతో మావోయిస్టు పార్టీ డీలా పడ్డట్లు తెలుస్తోంది. ముఖ్యనాయకుల మృతితో ఇతర నాయకులు పార్టీ నుంచి బయటకు వచ్చేందుకు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. చిన్న క్యాడర్ నుంచి పెద్ద క్యాడర్ నాయకుల వరకు ఆలోచనలో పడ్డట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఇక లొంగుబాట్లు కడాఆ జరుగుతాయని చెబుతున్నాయి.

టెక్నాలజీ పట్టిస్తుందా..?

మావోయిస్టులు పట్టుబడటానికి వారు వినియోగిస్తున్న ఫోన్లే కారణమని తెలుస్తోంది. ఫోన్ సిగ్నల్ ఆధారంగా నక్సల్స్ జాడ తెలుసుకుని పోలీసులు వారిని ఎన్‌కౌంటర్ చేస్తున్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు. గతంలో వైర్‌లైస్ సెట్‌లు వాడిన మావోయిస్టులు వాటికి స్వస్తి చెప్పి కష్టాలు తెచ్చి పెట్టినట్లు తెలుస్తోంది. దానికి తోడు డ్రోన్, శాటిలైట్ వ్యవస్థ కూడా నక్సల్స్ అంతానికి కారణమయ్యాయి.

కొనసాగుతున్న బతుకమ్మ వేడుకలు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు5: బతుకమ్మ ఉత్సవాలు నగరంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి.. శనివారం మహిళలు నానబియ్యం బతుకమ్మ ఉత్సవాన్ని నిర్వహించారు. తంగేడు, తదితర పూలతో బతుకమ్మను పేర్చి పలు ఆలయాల్లో బతుకమ్మలను ఆడారు. ఈసందర్భంగా మహిళలంతా చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ గౌరీ దేవిని కొలిచారు. నానబెట్టిన బియ్యం, బెల్లంతో ప్రసాదాన్ని తయారు చేసి పంచారు.


నగరంలో బతుకమ్మలను తీసుకువస్తున్న మహిళలు

ఇక విపత్తుల సైన్యం

(5వ పేజీ తరువాయి)

కమిషనర్ అభిషేక్ ఆగస్త్య కార్యాచరణ చేశారు. ప్రతి డివిజన్ నుంచి ఒక్కర్ని ఎంపిక చేయాలని నిర్ణయించారు. మొత్తం 60 మందిని నియమించేందుకు కార్యాచరణ చేశారు. ఎటువంటి వివాదాలు లేకుండా మేయర్ పునుకొల్లు నీరజ సూచనల మేరకు ప్రతి డివిజన్ నుంచి కార్పొరేటర్లు సిఫారసులు చేసిన వారిని డివిజన్‌కు ఒక్కర్ని చొప్పున నియామకం చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. కనీసం 7వ తరగతి చదివి, 18 ఏళ్ల నుంచి 45సంవత్సరాలు వయస్సు వారిని ఎంపిక చేస్తున్నారు. ప్రతి ముగ్గురిలో ఇద్దరు పురుషులు ఒక మహిళ ఉండేలా టీంలను ఏర్పాటు చేస్తున్నారు. పురుషులు స్విమింగ్, రిస్క్ అపరేషన్‌లో ఉంటే మహిళలు వైద్యం, ఇతర సేవలు అందించేందుకు కార్యచరణ చేశారు. అపదమిత్రాలకు ప్రభుత్వ విపత్తుల శాఖల నుంచి 12 రోజులు పాటు ఖమ్మంలోనే శిక్షణ ఇవ్వనున్నారు. నియామకాలు అనంతరం ప్రభుత్వం అపద మిత్రాలకు గౌరవభృతి అందించే అవకాశం ఉంది.

నేడు నగరంలో కథ-2023 ఆవిష్కరణ

● ముఖ్య అతిథిగా ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె. శ్రీనివాస్

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 5: కథ-2023 సంకలనాన్ని ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు ఖమ్మంలోని జడ్పీసమావేశ మందిరంలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ ఆవిష్కరించనున్నారు. జాషువా సాహిత్యవేదిక ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు విద్యావేత్త, కవి రవి మారుత్ అధ్యక్షత వహిస్తారు. సభలో ప్రముఖ సాహితీవేత్త కె.శివారెడ్డి, మరో సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు, కథాసాహితీ సంపదాకులు వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్ పాల్గొంటారు. పుస్తకాన్ని పి. జ్యోతి సమీక్షిస్తారు. పుస్తకానికి కథలు అందించిన రచయితలు.. ఎ.వి. రమణమూర్తి ఆధ్వర్యంలో తమ కథ నేపథ్యాన్ని వివరిస్తారు. కార్యక్రమంలో కవులు, రచయతలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని రవి మారుత్ కోరారు.

వెంకటస్వామి ఆశయాలు సాధించాలి


వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

● అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం, అక్టోబరు5 (ఆంధ్రజ్యోతి) : గడ్డం వెంకటస్వామి నిస్వార్థంగా రాజకీయ జీవితంలో ఎంతోమందికి సేవచేసి యావత్ జాతికి ఆదర్శప్రాయంగా నిలిచారని అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో వెంకటరస్వామి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిపాలన అధికారి రమాదేవి, ఎల్‌డీఎం వెంకటరామిరెడ్డి, జిల్లా ఆడిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, తహసిల్దార్ రమేష్, డీఎంవో త్రినాథ్ బాబు, శ్రీనివాసరావు, ఎటీవో, డిసెక్షన్ సూపరింటెండెంట్ యాసీన్ పాల్గొన్నారు.

సింగరేణి ప్రధాన కార్యాలయంలో..

సింగరేణి ప్రధాన కార్యాలయంలోని హెచ్‌ఆర్‌డీ కాన్ఫరెన్స్ హల్ వద్ద గడ్డం వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం (ఈఅండ్‌ఎం) ఓసీపీ డీవీఎస్. సూర్యనారాయణ వెంకటస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఎన్వీరాల్‌మెంట్) ఎ. మనోహర్, జీఎం (హెచ్‌ఆర్‌డీ) వీసం కృష్ణయ్య గుర్తింపు సంఘం (ఎఐటీయూసీ) బ్రాంచి సెక్రటరీ ఎస్‌వి. రమణమూర్తి, ప్రాతినిధ్య సంఘం కార్పోరేట్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. పీతాంబరరావు, రాజేంద్ర ప్రసాద్, ముకుంద సత్యనారాయణ, సుశీల్‌కుమార్, శివకుమార్. టి. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

» అధికారుల నిర్లక్ష్యమే కారణమని సబ్‌స్టేషన్ ఎదుట బంధువుల ఆందోళన

» ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో ఘటన



సబ్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న బంధువులు(ఇన్‌సెట్‌లో రైతు ప్రసాద్(ఫైల్)

చింతకాని, అక్టోబరు 5: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందిన ఘటన శనివారం ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెం గ్రామంలో జరిగింది. మూడు రోజుల క్రితం వచ్చిన గాలిదుమారానికి లచ్చన్నగూడెం గ్రామంలో భారీ వృక్షం విద్యుత్ తీగలపై పడటంతో ఆ తీగలు వరి పొలంలో తెగి పడ్డాయి. దాంతో తీగలు తెగి నేలపై పడిన విషయాన్ని గ్రామ రైతులు ఫోన్ ద్వారా విద్యుత్ సిబ్బందికి తెలపడంతో సరిచేస్తామని బదులిచ్చారు. అయితే శనివారం ఉదయం గూని ప్రసాద్(59) అనే రైతు తన సోదరులు గూని అప్పారావు, వెంకటేశ్వర్లుతో కలిసి వరి పొలానికి క్రిమిసంహారక మందు పిచికారీ చేసేందుకు వెళ్లారు. అయితే విద్యుత్ తీగ తెగిన విషయం తెలియని ప్రసాద్ పొలానికి మందు కొడుతుండగా పొలంలో పడిన కరెంటు తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు అక్కడే ఉన్న మృతుడి సోదరులు వెంటనే సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను నిలిపివేశారు. తన అన్న కళ్ల ముందు మృతి చెందడంతో షాక్ గురైన సోదరుడు వెంకటేశ్వర్లు అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో అతడిని ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాలిదుమారానికి తీగలు తెగిపడ్డాయని విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చానా పట్టించుకోలేదని, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే తమ తండ్రి చనిపోయాడని మృతుడి కుమార్తెలు, బంధువులు కొదుమూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. సుమారు ఐదు గంటల పాటు సబ్‌స్టేషన్ వద్ద తీవ్ర ఆందోళన కొనసాగింది. తరువాత తమకు న్యాయం జరగడంలేదని మృతుడి బంధువులు మృతదేహంతో కలెక్టర్ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో పోలీసులకు, బంధువులకు మధ్య తోపులాట జరిగింది. విషయం తెలుసుకున్న ఖమ్మం ఏసీపీ రమణారెడ్డి, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, డీఈ రామారావు ఘటన ప్రాంతానికి చేరుకుని మృతుడి బంధువులతో చర్చించి కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. బాధితుల ఆందోళన నేపథ్యంలో ఖమ్మం ఏసీపీ రమణారెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతుడిపై ఆధారపడి ఎనిమిది మంది జీవిస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

బోనకల్, అక్టోబరు 5: ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన అమరబోయిన ధనయ్య (32) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఆర్థిక పరిస్థితులతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో తీవ్ర వత్తిడికి లోనై ఇంట్లో ఎవ్వరూ లేని ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఎస్ఐ మధుబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

ప్రభుత్వ వాహనంలో టేకు దిమ్మెల రవాణా

» రెండు వాహనాల సీజ్ » ముగ్గురిపై కేసు నమోదు

దుమ్ముగూడెం అక్టోబరు 5: దుమ్ముగూడెం మండల 102 ప్రభుత్వ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న టేకు దిమ్మెలను శుక్రవారం రాత్రి సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వివరాల ప్రకారం.. జిన్నెలగూడెం వద్ద పోలీసు అధికారులకు అటువైపుగా వస్తున్న 102 వాహనం కంటపడింది. పోలీసులను చూసిన ఆ వాహన డ్రైవరు అతివేగంగా నడపడంతో వారికి అనుమానం కలిగింది. వెంబడించిన పోలీసు సిబ్బంది రాయగట్టు గ్రామ సమీపంలో వాహనాన్ని పట్టుకున్నారు. కాగా పోలీసులను తప్పించుకొని 102 వాహన డ్రైవరు పారిపోగా, స్మగ్లింగ్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. డ్రైవరు దుమ్ముగూడెం మండలం గంగోలుకు చెందిన వ్యక్తి కాగా, స్మగ్లర్లను జిన్నెలగూడేనికి చెందిన శ్యామల పాపారావుతోపాటు గౌరారానికి చెందిన మరొక వ్యకిగా పోలీసులు గుర్తించారు. వాహనాలతోపాటు పట్టుబడిన ఏడు టేకు దిమ్మెలు, స్మగ్లర్లను పోలీసు అధికారులు శనివారం అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కాగా గతంలోనూ ఇదే 102 వాహనంపై టేకు దిమ్మెలను పలుమార్లు అక్రమంగా రవాణా చేశారని తెలుస్తోంది. టేకుదిమ్మెలతో సహా పట్టుబడిన రెండు వాహనాలను రేంజి అధికారి కమల భద్రాచలం కార్యాలయానికి తరలించారు. అక్రమ రవాణా సమయంలో స్మగ్లరు వినియోగించిన వాహనాలను సీజ్ చేశారు. పట్టుబడిన టేకు దిమ్మెల విలువ రూ.83వేలుగా నిర్ధారించారు. ముగ్గురిపై కేసు నమోదు చేశారు. పట్టుబడిన టేకు దిమ్మెలు జిన్నెలగూడెం నుంచి మోరంపల్లి బంజరుకు అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం.

దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 5: నగరంలోని టేకులపల్లిలోగా ప్రభుత్వ ఐటీఐలో ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన ఆరు నూతన ట్రేడ్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలను ప్రభుత్వం ఇటీవల ఏటీసీలుగా మారుస్తూ నూతనంగా ఆరు ట్రేడ్‌లను ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఈ దరఖాస్తులు ఈ నెల 5 నుంచి 9వ తేదీలోగా ఆన్‌లైన్లో చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అర్హులైన ఆసక్తి గల అభ్యర్థులు సకాలంలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలో సంప్రదించాలని తెలిపారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కృష్ణచైతన్య

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 5: సంతోష్ సేవా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నగరంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సంతోష్ మెమోరియల్ జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభ మయ్యాయి. పోటీలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 40 టీమ్‌లు పాల్గొన్నాయి. పోటీలను జిల్లా కాంగ్రెస్ నాయకుడు చింతనిప్పు కృష్ణచైతన్య క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. కార్యక్రమంలో టోర్నీ ఆర్గనైజర్ బలుసు మురళీకృష్ణ, సాయికృష్ణచైతన్య, గోపి, వెంకటేష్, మహేష్, సాయి, భరత్, అభి, నాని, హనీష్, సాయిచంద్ పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలి

వరి, పత్తి సాగులో మెళకువలపై శాస్త్రవేత్తల సూచనలు

మధిర, అక్టోబరు 5: జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి, పత్తి పంటలకు వివిధ చీడపీడలు ఆశించినట్లు గమనించడం జరిగిందని రైతులు క్రమం తప్పకుండా కలియ తిరుగుతూ పురుగులు, తెగుళ్ల ఉధ్రుతిని గుర్తించి ఎప్పటికప్పుడు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త రుక్మిణీ దేవి తెలిపారు.

వరిలో....నివారణ చర్యలు

వరి పంట బాగా దుబ్బుచేసిన దశలో 30-35కిలోల యూరియా, అంకురం తొడిగే దశలో 30-35కిలోల యూరియా, 15కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు వేయాలి. సుడిదోమ ఆశిస్తే పిలక దశలో దుబ్బుకు 10-15దోమలు, అంకురం నుంచి ఈనిన దశలో 20-25దోమలు ఉన్నట్లు గమనిస్తే తొలిదశలో ఎసిఫేట్ 1.5గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దోమ ఉధ్రుతి అంతకన్నా ఎక్కువగా ఉంటే డైనోటెఫ్యూరాన్ 20యస్‌జీ 0.4గ్రా. లేదా డైమోటోజైన్ 50డబ్ల్యూజీ 0.6గ్రా. లేదా ట్రైఫ్లూమెజోఫైరిమ్ 0.485 మి.లీ. లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ల మీద పడేటట్లు పిచికారి చేయాలి.

అగ్గితెగులు ఆశిస్తే.. తొలి దశ లో మచ్చలను గుర్తించి ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా ట్రైసైక్లజోల్ 0.6గ్రా. లేదా కాసుగామైసిన్ 2.5మిలీ. లేదా ట్రైసైక్లోజోల్+మ్యాంకోజెబ్ 2.5గ్రా. లీటరు నీటికి కలిపి ఎకరాకు పిచికారి చేసుకోవాలి.

పత్తిలో.. గులాబీ రంగు పురుగు నివారణకు



- పత్తి పూత, కాత, కాయ దశలలో ఉంది. నేలలో అధిక తేమ, లేదా బెట్ట పరిస్థితులలో పూత, కాత రాలడం జరుగుతుంది. ఈ సమస్య ఎక్కువగా ఉంటే ప్లానోఫిక్స్ 1మి.లీ. మందును 5లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలి.
- యూరియా, పొటాష్ ఎరువును పంట 80-90 రోజుల దశవరకే వాడాలి.
- మొక్క ఎదుగుదల తక్కువగా ఉన్నట్లయితే పైపాటుగా లీటరు నీటికి 10గ్రా. చొప్పున 13:0:45 లేదా 19:19:19 లేదా యూరియా 20గ్రా. పురుగు, తెగులు మందును పిచికారి చేసేటప్పుడు కలుపుకొని పిచికారి చేయాలి.
- తామర, పేనుబంక, పచ్చదోమ నివారణకు ఎసిఫేట్ 1.5గ్రా. లేదా ఎసిటామిప్రిప్ 02గ్రా. లేదా థయోమిథాక్సామ్ 0.2గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- తలమాడుతెగులు గమనించినట్లయితే వయ్యారి బామ కలుపు మొక్కలను గుర్తించి తీసివేయాలి. ఫ్రిపోనిల్ 2మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 02గ్రా. కలుపుకొని పిచికారి చేయాలి.
- గులాబీరంగు పురుగు నివారణకు పంట పూత దశనుంచి 4-8 లింగాకర్షక బుట్టలు ఎకరాకు పెట్టుకోవాలి. గుడ్డి పూలను ఏరిపారేయాలి. మొదటగా ప్రొఫికోఫాస్ 2 మి.లీ.+వేపనూనె 5మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఇలా చేయడం ద్వారా చీడపీడల భారీ నుంచి పంటలను రక్షించుకోవచ్చని శాస్త్రవేత్తలు సూచించారు.



వరిలో ఆశించిన అగ్గితెగులు

వరద బాధిత విద్యార్థులకు ఉచితంగా సర్టిఫికెట్లు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 5: ఖమ్మం జిల్లాలో ఇటీవల కాలంలో అధిక వర్షాల కారణంగా మున్నేరు వరద ప్రభావం వలన ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సర్టిఫికెట్లు కోల్పోయిన విద్యార్థులకు ఎటువంటి రుసుం లేకుండా సర్టిఫికెట్లు జారీ చేస్తామని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెక్రటరీ తెలంగాణ బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ అనుమతితో విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడం జరుగుతుందని తెలిపారు. సర్టిఫికెట్లు వరదల్లో కోల్పోయిన వారు సంబంధిత కళాశాలల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్, ప్రిన్సిపాల్ డిక్లరేషన్ అప్లోడ్ చేస్తూ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దీంతో సర్టిఫికెట్లు జారీ అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వరదబాధిత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లాజిస్టిక్ సేవల విస్తరణ

● లాజిస్టిక్ ఏటీఎంఏ పవన్‌కుమార్ వెల్లడి

ఖమ్మం, ఖానాపురంహవేలి, అక్టోబరు 5: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇప్పటి వరకు బస్టాండ్‌లకే పరిమితమైన లాజిస్టిక్ సేవలు ఇక నుంచి మండల, గ్రామీణ ప్రాంతాల్లో కుడా అందుబాటులోకి వచ్చాయని లాజిస్టిక్ ఏటీఎంఏ పవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 35 లాజిస్టిక్ కేంద్రాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. బుక్‌చేసుకున్న పార్సిల్ వివరాలు తెలుసుకునేందుకు ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. లాజిస్టిక్ సేవల వివరాల కోసం ఖమ్మం 91542 98583, మధిర 91542 98582, సత్తుపల్లి 91542 98587, కొత్తగుడెం 91542 98587, భద్రాచలం 91542 98586, మణుగురు 91542 98588 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

● అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 5: అర్హత ఉన్న ప్రతీ ప్రభుత్వ ఉపాధ్యాయుడు నవంబరు 6 లోపు వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని చేపట్టాలని జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, అదనపు కలెక్టర్ డి. మధుసూదన్‌నాయక్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో విద్యాశాఖ, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం ఉపాధ్యాయుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కోసం అక్టోబరు 16, 25 తేదీలలో మొదటి, రెండో పబ్లికేషన్ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. 2019 న జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా నుంచి మొత్తం 3,634 మంది ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదయ్యారని పేర్కొన్నారు. గతంలో నమోదు చేసుకున్న వారు, జరగబోయే ఎన్నికలకు తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 1 ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు అధికంగా రుణాలు ఇవ్వొద్దు

● కమిషనర్ అభిషేక్ ఆగస్త్య



మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్ ఆగస్త్య

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 5: మహిళా సంఘాల నిర్వహణ మేరకు రుణాలు ఇవ్వాలని ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అన్నారు. శనివారం కేఎంసీ కార్యాలయంలో కమిషనర్ లీడ్ బ్యాంక్ మెనేజరు, మెప్మా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కనీస నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా మహిళా సంఘాలు టేకోవర్ చేసి పైసా పొదుపు డబ్బులు లేకుండానే రూ.లక్షల్లో రుణాలను బ్యాంకర్లు ఏలా మంజూరు చేస్తారని, ఆ సంఘాలు తిరిగి చెల్లింపులు నిర్వహించకుంటే ఎవ్వరూ బాధ్యత తీసుకుంటారని వారిని ప్రశ్నించారు. టేకోవర్ మహిళా సంఘాలకు రూ.10లక్షలకు మించి ఇవ్వొద్దని ఆదేశించారు. ప్రతి సభ్యులతో బ్యాంకర్లు నేరుగా మాట్లాడిన తర్వాతనే రుణాలను ఇవ్వాలన్నారు. బ్యాంకుల వద్దకు సంఘాల సభ్యులు లేదా అధ్యక్షులు వస్తేనే రుణాలను మంజూరు చేయాలని, ఆర్పీల జోక్యం నిబంధనల మేరకే ఉండాలన్నారు. సంఘాల పొదుపు నిల్వల మేరకు రుణాలను ఇవ్వాలన్నారు. మెప్మా టీఎంసీ గుడిపూడి సుజాత, ఎల్‌డీఎం శ్రీనివాసరావు, సీవోలు సల్మా, రోజా, ద్రౌపతి, ఉపేందర్ పాల్గొన్నారు. కాగా ముఖ్యమైన సమావేశానికి మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ గైరాజరవ్వడం కొసమెరుపు.

గణితం, ఆంగ్ల బోధన పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

● ఐటీడీఏ పీవో బి. రాహుల్



గిరిజన మ్యూజియాన్ని పరిశీలిస్తున్న పీవో రాహుల్

భద్రాచలం, అక్టోబరు 5: గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ, జీపీఎస్ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులకు గణితశాస్త్రం, ఆంగ్ల బోధన విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. శనివారం తన ఛాంబర్‌లో వేదిక్ గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులు, గురుకుల కళాశాల టీచర్లు, ఆశ్రమ పాఠశాల సబ్జెక్టు టీచర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు ముఖ్యంగా 3, 4, 5 తరగతి గణిత శాస్త్రం బోధించేటప్పుడు వారికి సులభమైన పద్ధతిలో అర్థమయ్యే విధంగా కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలు గురించి తెలిజేసే విధంగా టేబుల్స్‌పై దృష్టి పెట్టాలన్నారు. ఈ సమావేశంలో వేదిక్ గణితం డైరెక్టర్ మురహరి, డీడీ మణెమ్మ, ఆర్సీవో నాగార్జునరావు, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవో అశోక్‌కుమార్, జీసీడీవో అలివేలు మంగ తాయారు తదితరులు పాల్గొన్నారు.

యాత్రికులకు సౌకర్యాలు కల్పించేలా చూడాలి

ఐటీడీఏ పరిధిలోని గిరిజన మ్యూజియం అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కమిటీ సభ్యులు, వెదురు, మట్టితో డిజైన్‌గా తయారు చేసే సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ గిరిజనుల ఆచార, వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు, వారి సంప్రదాయకరమైన గిరిజన వంటకాలు తయారు చేసి మ్యూజియం తిలకించడానికి వచ్చే యాత్రికులకు అందించడానికి మ్యూజియాన్ని తయారు చేయించాలని అన్నారు. గిరిజన వంటకాలు తయారు చేయడానికి తప్పనిసరిగా మట్టితో కట్టిన ఇల్లు నిర్మించాలని, యాత్రికులు కూర్చొని గిరిజన వంటకాలు ఆస్వాదించడానికి వెదురుతో తయారు చేసిన కుర్చీలు, సోఫాలు ఏర్పాట్లు చేయాలని అన్నారు. అనంతరం గిరిజన మ్యూజియాన్ని సందర్శించి యాత్రికులకు అనుకూలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట అధికారులు ఉన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

● ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకుడు డాక్టర్ రవీందర్‌నాయక్

భద్రాచలం/బూర్గంపాడు, అక్టోబరు 5: గిరిజన నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. శనివారం భద్రాచలం ఏరియా వైద్యశాలతో పాటు బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులపై సిబ్బంది అవగాహన కలిగి ఉండి ప్రజలను చైతన్య పరచాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. భాస్కర్‌నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆర్. చైతన్య, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రామకృష్ణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ బాలాజీ, జిల్లా టీబీ అధికారి సాయి కల్యాణ్, డీఈఎంవో ఫయాజ్, డాక్టర్ కల్యాణ్, ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ సంతోష్, పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మీసాహితి, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డీహెచ్ రవీందర్‌నాయక్

డ్రోన్‌ల వినియోగంపై అవగాహన



డ్రోన్‌ల విధానంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అశ్వారావుపేట, అక్టోబరు 5: శనివారం పట్టణంలోని వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ ఐవీఎస్‌రెడ్డి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో కూడా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలసిన అవసరం ఉందన్నారు. అనంతరం సీనియర్ ప్రొ. గోపాలకృష్ణమూర్తి మాట్లాడుతూ ఇద్దరు మనుషులు ఒకరోజులో పిచికారి చేసే పొలాన్ని డ్రోన్ సహాయంతో అరగంటలోనే పూర్తి చేయవచ్చునని అన్నారు. భద్రాద్రి డ్రోన్స్ ఇన్‌చార్జి సాయి కిరణ్ వ్యవసాయ రంగంలో డ్రోన్ల వినియోగాన్ని, ఆవశ్యతక గురించి విద్యార్థులకు వివరించారు. అంతరం కళాశాలలోని వరి పొలానికి డ్రోన్ సహాయంతో పురుగు మందులు పిచికారి చేస్తూ, ఏ విధంగా పిచికారి చేయాలో విద్యార్థులకు ప్రదర్శించి చూపారు.

ఘనంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు5: భద్రాద్రి జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రకాశం మైదానం నందు అండర్-17 ఫుట్‌బాల్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులు ఆటుపోట్లను తట్టుకొనే శక్తి ఎక్కువగా ఉంటుందన్నారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడా అంటే తనకు చాలా ఇష్టమని, తాను డిపెండర్‌గా రాణించే వాడినని అన్నారు. ఫుట్‌బాల్ క్రీడాకారులు మిగతా క్రీడాకారులకు భిన్నంగా ఉంటారని పోరాటపటిమ ఎక్కువ ఉంటుందన్నారు. జిల్లా క్రీడా రంగ అభివృద్ధికి తప్పనిసరిగా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల పరిశీలకుడు వడెన్న, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాఠశాల క్రీడల నిర్వాహక కార్యదర్శి వాసిరెడ్డి నరేష్‌కుమార్, బట్టు ప్రేమ్ కుమార్, మనమదల వేణుగోపాల్, యుగందర్, జనక్ సింగ్, విద్యాసాగర్, కవిత, స్టెల్లా, సుజాత, సీతాదేవి, రాములమ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తొలి రోజు జరిగిన పోటీల వివరాలు ....

ప్రకాశం మైదానంలో జరిగిన పోటీల్లో నిజామాబాద్ జట్టు 2-1 గోల్స్ తేడాతో మహబూబ్‌నగర్ జట్టుపై విజయం సాధించింది. ఖమ్మం జిల్లా జట్టు నల్గొండ జట్టును నిలువరించి 0-0 స్కోర్‌తో మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో ఆదిలాబాద్ జట్టు, మహబూబాబాద్ జట్టు చేరో గోల్ 1-1 సాధించడంతో డ్రాగా ముగిసింది. నల్గొండ, నిజామాబాద్ జట్ల మధ్య జరిగిన నాలుగో మ్యాచ్ నల్గొండ జట్టు 3-0 గోల్స్‌తో విజయం సాధించింది. అదేవిధంగా మరో వేదిక నవభారత్ స్కూల్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదారాబాద్ జట్టుపై 3-1 స్కోర్‌తో వరంగల్ జట్టు విజయం సాధించింది. మెదక్ జట్టు 1-0 స్కోరుతో కరీంనగర్ జట్టుపై విజయం సాధించింది. హైదారాబాద్ జట్టు 0-1స్కోర్‌తో రంగారెడ్డి పై ఓటమి పాలైంది. అనంతరం జరిగిన మరో మ్యాచ్‌లో మెదక్ జట్టు 3-0 గోల్స్ స్కోరుతో వరంగల్ జట్టుపై విజయం సాధించగా, కరీంనగర్ రంగారెడ్డి జట్ల పోటీల్లో జరిగిన మరో మ్యాచ్‌లో చేరో గోల్ 1-1 సాధించడంతో మ్యాచ్ డ్రా గా ముగిసింది.



నిజామాబాద్-మహబూబ్‌నగర్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

ధరణి తెచ్చిన భూ వివాదం

» కోర్టును ఆశ్రయించిన ఇళ్ల స్థలాల కొనుగోలుదారులు

» హద్దులను ఏర్పాటు చేసిన అధికారులు

» ధ్వంసం చేసిన బాధితులు



హద్దు రాళ్లను తీసివేస్తున్న బాధితులు

ఖమ్మం సంక్షేమ విభాగం, అక్టోబరు 5: ధరణి పోర్టల్‌లో జరిగిన సర్వే నెంబర్ తప్పిదంతో 89 మంది ఇళ్ల స్థలాల కొనుగోలుదారులను వీధిన పడేసింది. దీంతో బాధితులు కోర్టును ఆశ్రయించి న్యాయం పోరాటం చేస్తుండగా, మరో పక్కన అధికారులు ఏకంగా హద్దులు ఏర్పాటు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టడంతో బాధితులు శనివారం వివాదాస్పద భూమి వద్దకు వెళ్లి హద్దు రాళ్లను తొలగించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల కథనం మేరకు.. ఖమ్మం నగరంలోని సర్వే నెంబర్ 186, 187లో అనుమోలు భద్రయ్య అనే వ్యక్తి భూమి నుంచి ఇళ్ల స్థలాలును ప్లాట్‌గా మార్పు జరిగిందని తెలిపారు. 2007నుంచి 2011 వరకు పలు ధపాలుగా ఖమ్మం నగరంలోని వీధి వ్యాపారులు, చిరు ఉద్యోగులు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. తర్వాత కాలంలో 186 సర్వే హద్దులు మారి, 187లో చేర్చి ధరణిలో నమోదు జరిగింది. దీంతో భూ వివాదం మొదలైంది. దీంతో భూములు కొనుగోలు చేసిన 89 మంది ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన బాధితులు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కేసు కొనసాగుతుంది. ఈ క్రమంలోనే కొంతమంది వ్యక్తులతో కలిసి అధికారులు వివాదాస్పద భూమికి హద్దులు ఏర్పాటు చేశారు. కాగా బాధితులు హద్దులను ధ్వంసం చేశారు. న్యాయం చేయాలని బాధితులు చావా నాగేశ్వరావు, రవి, గౌరమ్మ, సునిత, ఏపూరి కిరణ్, గోల్లమందల మల్లయ్య, బాణోత్ మహేష్‌లు డిమాండ్ చేశారు. అవసరమైతే నిరసన దీక్షలు చేస్తామని హెచ్చరించారు.

ప్రణాళికతో స్త్రీనిధి బకాయిల వసూళ్లు

● స్త్రీనిధి జిల్లా ఆర్ఎం శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జూలూరుపాడు, అక్టోబరు 5: జిల్లాలో పేరుకుపోయిన స్త్రీనిధి బకాయిలను ఈ నెల31 నాటికి వసూళ్లు చేసేందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు స్త్రీనిధి జిల్లా రీజినల్ మేనేజర్ బి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం జూలూరుపాడులోని సెర్ఫ్ కార్యలయంలో బకాయిల రికవరీపై గ్రామ దీపికలతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని సభ్యులు రూ.78 కోట్ల బకాయిలను చెల్లించాల్సి ఉండగా, వాటిలో సెర్ఫ్ సిబ్బంది రూ.40 కోట్ల బకాయిలను వసూళ్లు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది జిల్లాలో రూ.94కోట్ల స్త్రీనిధి రుణాలను సంఘాల్లోని సభ్యులకు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇప్పటి వరకు రూ.17 కోట్ల రుణాలను అందించడం జరిగిందన్నారు. జూలూరుపాడు మండలంలో రూ.3.11 కోట్ల రుణాలను అందించాల్సి ఉండగా, ఇప్పటి వరకు రూ.97 లక్షలను పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలో రూ.2.10 కోట్లను వసూలు చేయాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో స్త్రీనిధి జిల్లా అసిస్టెంట్ మేనేజర్ ఎం.సంపత్ కుమార్, సీసీలు ధారావత్ నాగేశ్వరరావు, మధు, రామారావు పాల్గొన్నారు.

మైసూర్‌ను తలదన్నేలా దసరా ఏర్పాట్లు: ఎమ్మెల్యే

ఇల్లెందు టౌన్, అక్టోబరు 5: ఇల్లెందు పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలు మైసూర్‌లో తలతన్నేలా చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. శనివారం పట్టణంలోని జేకే కాలనీ సింగరేణి గ్రౌండ్‌లో దసరా ఉత్సవాల నిర్వహణ కోసం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశబ్ధాలుగా జరుగుతున్న దసరా ఉత్సవాలను ఈ దఫా కూడ అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. వేడుకలకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్‌చైర్మన్ జానీ, కాంగ్రెస్ నాయకులు డానియల్, ఆలయ కమిటీ చైర్మన్ గందె సదానందం, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, ఈశ్వర్, హరినాధబాబు తదితరులు పాల్గొన్నారు.

పండుగ పూటా పస్తులేనా..?

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆకలి కేకలు

20 నెలలుగా అందని వేతనాలు

రేపటి నుంచి దీక్షలకు సిద్ధమవుతున్న సిబ్బంది

భద్రాచలం, అక్టోబరు 5: ప్రతి నెల జీతం వస్తేనే అంతంత మాత్రంగా సాగుతున్న పరిస్థితుల్లో 20 నెలలుగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదు. ఇది ఎక్కడో కాదు భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని వసతి గృహాల్లో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బంది దుస్థితి. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో మొత్తం 21 వసతి గృహాలుండగా 93 మంది సిబ్బంది అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్నారు. వీరికి గత 20 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో వారి పరిస్థితి వర్ణనాతీతం. ఈ విషయంపై భద్రాచలం ఐటీడీఏ పీవో, గిరిజనసంక్షేమ శాఖ కమిషనర్‌ల వద్ద పలుమార్లు తమ గోడు వెళ్ల బుచ్చుకున్నా వారికి వేతనాలు చేతికి అందని పరిస్థితి ఉంది. ఈ


దివ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం (ఫైల్)

ఏడాది జూలై రెండున హైదరాబాద్‌లో తమకు పెండింగు వేతన బకాయిలు చెల్లించాలని సిబ్బంది ప్రజాపాలన రాష్ట్ర నోడల్ అధికారి దేవరాజన్ దివ్యకు విన్నవించగా ఆమె సానుకూలంగా స్పందించారు.

ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐటీడీఏల పరిధిలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి రూ.12.87 కోట్లకు చెక్కులు రిలీజ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో తమ వేతనాలు వెంటనే వస్తాయని భావించిన సిబ్బందికి నిరాశే ఎదురైంది. మూడు నెలలు దాటుతున్నా జారీ చేసిన చెక్కులకు ఆర్థిక శాఖ నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో చెల్లింపులు సాధ్యం కాలేదని విశ్వసనీయ సమాచారం. దీంతో అవుట్‌సోర్సింగ్ సిబ్బంది తెలంగాణలో అతిపెద్ద పండుగైన దసరా పండుగ రోజు సైతం తాము పస్తులతో ఆకలి కేకలు ఎదుర్కోవాలా అని వాపోతున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు రాష్ట్ర ప్రభుత్వంలో ప్రాతినిధ్యం వహిస్తున్నా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వేతన బకాయిలకు మోక్షం లభించకపోవడం పట్ల సీఐటీయు జిల్లా అధ్యక్షులు కొలగాని బ్రహ్మచారి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి 20 నెలల వేతనాలు చెల్లించాలని లేదంటే సోమవారం నుంచి భద్రాచలం ఐటీడీఏ ముందు ఆకలికేక పేరిట నిరాహారదీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

సదుపాయాల కల్పనే ధ్యేయం: పాయం



అశ్వాపురం అక్టోబరు 5: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కొమ్ముగూడెం, గొల్లగూడెం గ్రామాల్లో రూ.12.5 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రహదారులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అంతకు ముందు అనారోగ్యంతో బాధపడుతున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్యను ఎమ్మెల్యే పరామర్శించారు.

టాటా టెక్నాలజీ శిక్షణ సెంటర్‌కు భూమి పూజ

మణుగూరు: మణుగూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటిఐ) ప్రాంగణంలో రూ.4.60లక్షలను వెచ్చించి నిర్మించనున్న టాటా టెక్నాలజీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎమ్మెల్యే మాట్లాడారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

గ్రామాలలో సమస్యలను పరిశీలిస్తా

ఎమ్మెల్యే కూనంనేని సాంశివరావు

సుజాతనగర్, అక్టోబరు 5: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తానని, గ్రామాలలో సమస్యలను పరిశీలించి వాటిని నివారణకు కృషి చేస్తానని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం మండలంలోని సింగభూపాలెం గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి 50 లక్షల రూపాయలను మంజూరు చేశామన్నారు. సింగభూపాలెంలో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, త్రాగునీరు సదుపాయం కల్పిస్తామని, పార్టీలకాతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ప్రభుత్వ పథకాలను అందజేస్తామన్నారు. ఏ ఒక్కరికి ఆపద వచ్చినా తాను అండగా ఉంటానని, అందరూ నేరుగా వచ్చి కలవవచ్చని తెలిపారు. సింగభూ పాలెం చెరువును పర్యాటక ప్రాంతంగా మార్చడానికి రూ. 8.5 కోట్ల రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. గ్రామాలలో వ్యవసాయ పనులకోసం వెళ్లే రైతుల కోసం రోడ్లను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. గ్రామ సమస్యలను కార్యదర్శి పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలుపగా కార్యదర్శిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి గ్రామంలో తిరిగి రోడ్లను, మంచినీటి బోరింగ్‌లను, డ్రైనేజీ, విద్యుత్ వంటి సమస్యల పరిష్కారం కోసం అధికారులు వెంటనే పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

సాబీర్‌పాషా, సీపీఐ జిల్లా సమితి సభ్యులు దస్రు, నాయకులు రాములు, హన్మంతరావు, శ్రీనివాసరావు, తాళ్లూరి పాపారావు, ధర్మారావు, తాళ్ల వెంకటేశ్వర్లు, దుర్గాప్రసాద్, బొడ్డు కేశవరావు, వెంకటేష్, దండు సురేష్, నర్సింహారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి అండగా..

కొత్తగూడెం, అక్టోబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతి చెందిన 2000 బ్యాచ్‌కి చెందిన కానిస్టేబుల్ రమణారెడ్డి కుటుంబానికి తమ తోటి బ్యాచ్ కానిస్టేబుళ్లు రూ. 2లక్షలను చెక్కుల రూపంలో శనివారం ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా అందజేశారు. కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా అభినందించారు. రమణా రెడ్డి ప్రస్తుత కుటుంబ పరిస్థితులను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి'


మాట్లాడుతున్న ఆరెం రామయ్య

జూలూరుపాడు, అక్టోబరు 5: గ్రామ స్థాయి నుంచి టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా నాయకులు అరెం రామయ్య అన్నారు. శనివారం ఆయన మండలంలోని కాకర్ల గ్రామాన్ని సందర్శించి ఎన్టీఆర్ విగ్రహా ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందని కార్యకర్తలు, నాయకులు ఎన్నికలకు సన్నద్ధం కావాలని తెలిపారు. త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించటం జరుగుతుందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు తెలంగాణలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించారని, అధినేత సూచనల మేరకు నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. హామీలను అమ లు చేయాలని లేకుంటే టీడీపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడ తామని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా నాయకుడు రోకటి నరసిం హారావు, నాయకులు చల్లమల గోవింద్, చావా వెంకటేశ్వర్లు, వెంకటనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఏజెన్సీలో వైద్య సేవలు పెరగాలి'


ఆసుపత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు అక్టోబరు 5: ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు అధునాతన వైద్యసేవలు అందుబాటులోకి రావాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. శనివారం పట్టణంలో ప్రజా వైద్యశాలను వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగంలో కూడా వైద్యసేవలు అందించాలని సూచించారు... ఈ కార్యక్రమంలో. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య. వైస్ చైర్మన్ జానీ పాషా, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి, ఆసుపత్రి వైద్యులు హర్షవర్ధన్, రవితేజస్వి, అయితా శ్రావణ్, మాధురి తదితరులు పాల్గొన్నారు...

రూ.2లక్షల రుణమాఫీ చేసి తీరుతాం

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే.. అభివృద్ధి పనులకు శ్రీకారం


అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జారే

చంద్రుగొండ, అక్టోబరు 5: రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆహామీని అమలు చేసి తీరుతామని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తెలిపారు. శనివారం మండలంలో పలుగ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే దత్తత తీసుకున్న మహ్మద్‌నగర్ గ్రామంలో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు మూడు బోరు బావుల ఏర్పాటు పనులను ప్రారంభించారు. దీంతో పాటు మద్దుకూరు, అన్నారంతండాలో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం, తుంగారంలో గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మహ్మద్‌నగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, అభివృద్ధి పనులకు తొలిదశలో రూ.1.85 కోట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. కేరళ రాష్ట్రం తరహాలో అంగన్వాడి భవనాలను ప్రభుత్వం నిర్మించదలచిందని ఎమ్మెల్యే తెలిపారు. చంద్రుగొండ మండలంలో మద్దుకూరు, అన్నారంతండాలో నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.15 లక్షలతో నిర్మించే అంగన్వాడి భవనంలో కేరళ తరహాలో సకల సౌకర్యాలు కల్పించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అశోక్, ఏఈ శ్రీనివాస్, సీనియర్ నాయకులు మాళోత్ భోజ్యానాయక్, నల్లమోతు రమణ, ఉప్పతల ఏడుకొండలు, కృష్ణవేణి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో శరన్నవరాత్రులు


పూజల్లో పాల్గొన్న కోనేరు చిన్ని, నరేంద్ర భవాని

కొత్తగూడెం సాంస్కృతికం, అక్టోబరు 5: దుర్గా అమ్మవారి శరన్నవరాత్రులను కొత్తగూడెంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం కొత్తగూడెం బూడిదగడ్డలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో కాళీ ఉపాసకులు నరేంద్రభవాని ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, పూలమాలలతో ప్రత్యేక అలంకరణ చేసి విశేష పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ (చిన్ని) పూజల్లో పాల్గొన్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటుచేసిన దేవిశరన్నవరాత్రి ఉత్సవ మండపంలో సీఐ శివ ప్రసాద్ దంపతులు పూజలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళులు

దుమ్ముగూడెం, అక్టోబరు 5: అచ్యుతాపురంలో అనారోగ్యంతో మృతి చెందిన గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలి భర్త కొడిమి వెంకటేశ్వరావు మృతదేహాన్ని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం సందర్శించారు. కుటుంబాన్ని పరామర్శించి, ఆయన మృతికి ఘన నివాళులర్పించారు. నాయకులు లంకా అబ్బులు, మట్టా శివాజీ, బత్తుల శోభన్, కల్లూరి ఆదినారాయణ తదితరులున్నారు.

అవినీతిపై విచారణ చేయాలి

మణుగూరు టౌన్, అక్టోబరు 5: మణుగూరు మునిసిపాలిటీలోని మెప్మా పొదుపు సంఘాల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై జిల్లా అధికారులు తగిన విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఐ మండల కమిటీ నాయకులు శనివారం డిమాండ్ చేశారు. ఈ విషయంపై గత 15 రోజులుగా దివ్యాంగులు రావుల కుమార స్వామి, శ్రీదేవి దీక్షలు చేస్తున్నా పట్టించునే దిక్కులేకుండా పోయిందన్నారు. గిరిజన సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుటుంబరావు, సుధాకర్, ఏఐటీయూసీ అధ్యక్షుడు రమేష్, కొత్తపల్లి సీతరాములు, ఉమర్ మాట్లాడారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: కోరం



టేకులపల్లి, అక్టోబరు 5: గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని బద్దుతండా గ్రామం నుంచి ఏకలవ్య పాఠశాల మీదుగా ఎర్రబోడు వరకు రూ.50లక్షలు వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభ్యున్నతి కోసం పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగభవానీ, ఎంపీడీవో రవీందర్ రావు, ఎంపీవో గణేష్‌గాంధీ, ఐటీడీఏ ఏఈ సలార్, మాజీ ఎంపీటీసీ సభ్యులు రామకృష్ణ, మాజీ సర్పంచ్ భూక్యా చిన్ని, కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఈది గణేష్, పోశాలు, మధురెడ్డి, ఇస్లావతు రెడ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.